భద్రత మీ చేతుల్లోనే..

- హెల్మెట్‌ధారణతోనే సురక్షిత ప్రయాణం
- ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్


తాళ్లపద్మావతి కాలేజీ ప్రతినిధులను అభినందిస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీధర్

ఖిలా వరంగల్: రహదారి భద్రత మీచేతుల్లోనే ఉంటుందని, ఇందుకు రహదారి భద్రత అనేది ఒక నినాదంలా కాకుండా సామాజిక బాధ్యత, జీవన విధానంగా మల్చుకున్నప్పుడే ప్రమాదాలను నివారించవచ్చని వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ అన్నారు.. సీపీ అంబర్ కిషోర్ ఝా, ట్రాఫిక్ ఏసీపీ ఎం.భోజరాజు ఆదేశాల మేరకు జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం వరంగల్ సెంట్రల్ జైలు పెట్రోల్‌బంక్ సమీపాన వరంగల్ ట్రాఫిక్, తాళ్ల పద్మావతి ఫార్మసీ కాలేజీ, నెహ్రూ యువ కేంద్రం ఆర్గనైజర్ సంయుక్త ఆధ్వర్యంలో రోడ్డు భద్రత, డ్రైవర్లు, ఓనర్లు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ద్విచక్రవాహనంపై హెల్మెట్‌ధారణతోనే సురక్షిత ప్రయాణం చేయగలరని సూచించారు. డ్రైవర్లు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలను సక్రమంగా పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. వాహనాలల్లో పరిమితిని మించి ప్రయాణికులు, ఓవర్‌లోడును అనుమతించవద్దని సూచించారు. అనంతరం నెహ్రూ యువ కేంద్రం ప్రతినిధులకు సీఐ శ్రీధర్ సన్మానించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ యూత్ ఆఫీసర్ నెహ్రూ యువ కేంద్రం సీహెచ్ ఆన్వేష్, తాళ్ల పద్మావతి కాలేజీ ప్రిన్స్‌పాల్ వెంకటేశ్వరావు ప్రైవేట్ విద్యాసంస్థల బస్సుల ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గాదె స్వరూప్‌రెడ్డి, చైర్మన్ తాళ్ల మల్లేశం, డైరెక్టర్ వరుణ్, డాక్టర్ తాళ్ల వైష్ణవి, తదితరులు పాల్గొన్నారు.

నదీ జలాల హక్కుల కోసం ఉద్యమిస్తాం

- బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్


బహిరంగ సభకు వెళ్తున్న వాహనాల శ్రేణిని ప్రారంభిస్తున్న వినయ్‌భాస్కర్

హన్మకొండ: నదీ జలాల హక్కుల కోసం ఉద్యమిస్తామని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లాలో జరిగిన బీఆర్ఎస్ బహిరంగ సభకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. బాలసముద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద ఆయన వాహన శ్రేణిని ప్రారంభించి మాట్లాడుతూ కృష్ణానది జలాల్లో తెలంగాణ వాటాను సాధించుకుంటామన్నారు. రాష్ట్రానికి అన్యాయం జరిగితే ఊరుకునేది లేదన్నారు. చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం నీటి హక్కులను కేంద్రానికి వదిలిపెట్టడం తెలంగాణ ప్రజలకు అన్యాయం చేయడమేనన్నారు. కార్యక్రమంలో టీజీపీ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవరెడ్డి, కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజు, నాయకులు తాళ్లపల్లి జనార్దన్ గౌడ్, పులి రజినీకాంత్, నయీముద్దీన్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులు కేంద్రానికి అప్పగించడం అన్యాయం : అరూరి రమేశ్

తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ కేంద్రానికి అప్పగించడం అన్యాయమని బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్ అన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లాలో జరిగిన బహిరంగ సభకు వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో తరలివెళ్లారు. ఈ వాహనశ్రేణిని హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని స్వగృహం వద్ద ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకపోతే మరో ఉద్యమం లేవదీస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వరంగల్ జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు, కార్పొరేటర్లు ఇండ్ల నాగేశ్వర్ రావు, జక్కుల రజిత, అవాల రాధికారెడ్డి, దివ్యారాణి, నాయకులు లలితాయాదవ్, వనంరెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీధర్, వెంకటేశ్వర్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, బండి రజినికుమార్, చంద్ర మోహన్, జక్కు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం కృషి


కుష్ఠువ్యాధి నిర్మూలన ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా వైద్యాధికారులు

కాజీపేట రూరల్ : కుష్ఠువ్యాధి నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా ఉప వైద్యారోగ్య శాఖ అధికారి ఎండీ.యాకూబ్‌పాషా అన్నారు. కాజీపేట ఫాతిమానగర్ సర్వప్రేమ వెల్ఫేర్ సొసైటీ ప్రాంగణంలో మంగళవారం జిల్లా వైద్యారోగ్యశాఖ, సర్వప్రేమ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కుష్ఠువ్యాధి నిర్మూలన పక్షోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో యాకూబ్‌పాషా ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ప్రభుత్వం కుష్ఠువ్యాధిగ్రస్తులకు ఉచిత ఆపరేషన్లు నిర్వహించి రూ.8వేల ఆర్థిక సహాయం అందజేస్తుందని అన్నారు. జిల్లా హెచ్‌ఈఓ సందెల శ్రీనివాస్, సర్వప్రేమ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు పి.బాలస్వామిరెడ్డి, హెచ్.ప్రభాకర్ మాట్లాడుతూ సమాజంలో కుష్ఠువ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని అన్నారు. అంతకు ముందు ఫాతిమానగర్ మదర్‌థెరిసా సెంటర్‌లో కొలంబో నర్సింగ్ కాలేజ్ విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది, ఆశలు మానవహారం నిర్వహించి వ్యాధి నిర్మూలన కోసం నినాదాలు చేపట్టి అక్కడి నుంచి ర్యాలీగా సర్వప్రేమ సొసైటీకి చేరుకున్నారు. 50 మందికి పైగా వ్యాధిగ్రస్తులకు సర్వప్రేమ సొసైటీ ఆధ్వర్యంలో బెడ్‌షీట్లు, బ్రెడ్, పండ్లు, ఎంసీఆర్ పాదరక్షలు, మందులు పంపిణీ చేసినట్లు సర్వప్రేమ అధ్యక్ష కార్యదర్శులు బాలస్వామి రెడ్డి, ప్రభాకర్ తెలిపారు. జిల్లా అదనపు వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ మదన్‌మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్లు, వాణశ్రీ, ఉమశ్రీ, సత్యనారాయణ, జెరూస్యజన, డాక్టర్ నర్సింహారెడ్డి, సర్వప్రేమ సొసైటీ ట్రెజరర్ చిన్నప్ప పాల్గొన్నారు.

డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలి

హన్మకొండ అర్బన్ : డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని ఆర్‌టీఓ రంగారావు అన్నారు. రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా మంగళవారం రెవెన్యూకాలనీలోని రాజాశౌరి గార్డెన్స్‌లో విద్యాసంస్థల బస్‌ల అసోసియేషన్ అధ్యక్షుడు గాదె స్వరూప్‌రెడ్డి ఆధ్వర్యంలో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్‌టీఓ మాట్లాడుతూ డ్రైవర్లు సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. కార్యక్రమంలో వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, శ్రీనివాస్, స్కూల్ అసోసియేషన్ మెంబర్స్ బుచ్చిబాబు, శంకర్, డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సారయ్య, సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతమే లక్ష్యం

ఖిలా వరంగల్: బీజేపీ బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని, మోదీ చేపడుతున్న పేదల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సమ్మేళనం కో ఆర్డినేటర్ కుసుమ సతీష్ సూచించారు. మంగళవారం శివనగర్‌లోని పార్టీ కార్యాలయంలో తూర్పునియోజకవర్గ ఇన్‌చార్జ్ కన్వీనర్ శ్రీనివాస్ గుప్తా, ఓబీసీ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షుడు మహేష్ ఆధ్వర్యంలో పార్లమెంట్ స్థాయిలో బూతు సమ్మేళన సన్నాహక సమావేశం జరిగింది. శ్రీనివాస్, వెంకటేష్, శ్యాం, పాల్గొన్నారు.

అక్కపై తమ్ముడి దాడి

కాజీపేట: అక్కపై తమ్ముడు దాడి చేసిన ఘటన మంగళవారం దర్గా కాజీపేటలో చోటు చేసుకుంది. దర్గా కాజీపేటకు చెందిన పొన్నం పద్మపై తమ్ముడు మోడెం చంద్రశేఖర్ మరో ఇద్దరితో కలిసి దాడి చేయగా తీవ్రంగా గాయపడింది. చికిత్సకోసం ఎంజీఎంకు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

ఆత్మహత్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి


ధర్నా నిర్వహిస్తున్న డీఎస్‌యూ నాయకులు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో ఇటీవల విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని భువనగిరిలో పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు వైష్ణవి, భవ్య ఆత్మహత్య, సూర్యాపేట ఎస్సీ రెసిడెన్షియల్ కాలేజీలో దగ్గుపాటి వైష్ణవి, మరో కార్పొరేట్ కాలేజీ ఐఐటీలో వినయ్ ఆత్మహత్యలపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేస్తూ కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌తో ధర్మ స్టూడెంట్స్ యూనియన్ కేయూ గేట్‌వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ బాధ్యులు మాట్లాడుతూ ఆ రెండు కార్పొరేట్ కాలేజీలను తెలంగాణలో బ్యాన్ చేయాలన్నారు. విద్యార్థినుల ఆత్మహత్యలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ధర్మ స్టూడెంట్స్ యూనియన్ (డీఎస్‌యూ) ఇన్‌చార్జ్ పి.విష్ణు, కేయూ డీఎస్‌యూ నాయకులు అనిల్, పురుషోత్తమ్, నాగవేణి, సునీల్, ఠాగూర్, దినేష్, పవన్, పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌కు ఏకశిల విద్యార్థులు


విద్యార్థులకు ప్రశంసపత్రాలను అందజేస్తున్న ఏకశిల డిజీ స్కూల్ డైరెక్టర్ కొండల్‌రెడ్డి

ఖిలా వరంగల్: నేషనల్ సైన్స్ డే సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం, నేషనల్ సైన్స్ సెంటర్ వరంగల్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో వరంగల్ శివనగర్‌కు చెందిన ఏకశిల డిజీ స్కూల్ విద్యార్థులు కోక లతాశ్రీ, ఎండీ.సమ్రీన్, కె, సహస్ర విశేష ప్రతిభ చూపి తమ సత్తా చాటి రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం శివనగర్‌లోని ఏకశిల డీజీ స్కూల్‌లో జరిగిన సమావేశంలో స్కూల్ డైరెక్టర్ బేతి కొండల్‌రెడ్డి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లవకుమార్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ నరేందర్ రెడ్డి

హన్మకొండ: జేఈఈ మెయిన్స్‌లో అల్ఫోర్స్ విద్యార్థులకు పర్సంటైల్ పంట పండింది. మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభతో జాతీయస్థాయిలో అత్యద్భుత పర్సంటైల్ సాధించారని విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. బి.ఆదిత్యారావు 99.85 పర్సంటైల్‌లో అగ్రస్థానం నిలువగా జి.శ్రీహాస్ 99.74, సుబోద్ చౌదరి 99.59, ఎం.శ్రీరామ్ 99.42, ప్రణీత్ 99.20, నిఖేశ్ చోప్రా 99.08. ఎ.శివ వరుణ్ 99.05, సీహెచ్.అనూహ్య 98.99, పి.రఘు వీరారెడ్డి 98.96, ఎస్.సత్యఅమూల్య 98.95, విశాల్‌రెడ్డి 98.94, షఫీక్ 98.94, శివశంకరవరప్రసాద్ 98.91, శ్రీనిధి 98.83, ఎం.ప్రహర్ష 98.83, కె.పునీత్ మనోహర్ 98.83, రవిచంద్ర 98.42, ఏ.కార్తిక్ 98.19 పర్సంటైల్ సాధించారని వివరించారు. చాలా మంది విద్యార్థులు 90కి పైగా పర్సంటైల్ సాధించారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను చైర్మన్ నరేందర్‌రెడ్డి అభినందించారు.

జేఈఈ మెయిన్స్‌లో టాప్ ర్యాంకు


ప్రతీక్

విద్యారణ్యపురి: జేఈఈ మెయిన్స్ తొలివిడత మంగళవారం ప్రకటించిన ఫలితాల్లో హనుమకొండ విద్యార్థి ప్రతిభ కనబర్చాడు. అడ్వకేట్‌కాలనీకి చెందిన వడ్లూరి ప్రతీక్ 99.75 శాతం సాధించాడు. విద్యార్థి తండ్రి గణేష్ కుమార్ ఎస్‌ఆర్‌కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. ప్రణాళికతో చదవడంతోనే ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రతీక్‌తెలిపాడు.

మహిళా సాధికారత కోసం కృషి చేయాలి

రామన్నపేట : మహిళా సాధికారత, మహిళా అభివృద్ధి కోసం అందరూ అంకితభావంతో పనిచేయాలని ఎల్‌బీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో 10వ తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ కేడెట్లు ప్రిన్సిపాల్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాజేందర్‌రెడ్డి, కెప్టెన్ ఎం.సదానందం, జూనియర్ ఆఫీసర్ ఓం శ్రీ, కేడెట్లు, అక్షయ్‌కుమార్, ఇందిర, వినీత, లక్ష్మి, సుప్రియ, అంజలి, చందన, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బల్దియా కమిషనర్‌పై పరువునష్టం దావా

వరంగల్ అర్బన్ : చెరువులు, ఆక్రమణ ఏరియాల పరిరక్షణ సొసైటీ పరిరక్షణ ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందని సంస్థ ప్రతినిధులు పెరుమాండ్ల లక్ష్మణ్, తదితరులు పేర్కొన్నారు. ఈ మేరకు వారు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రేటర్ పరిధిలోని ఉన్న చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలను కాపాడుకోవాలనే లక్ష్యం తమ సంస్థ లక్ష్యమని తెలిపారు. గ్రేటర్ వరంగల్ కమిషనర్ ఆరోపణలను నిరసిస్తూ రూ. కోటి పరువునష్టం దావా వేసినట్లు పేర్కొన్నారు.

సంస్కరణలకు శ్రీకారం చుట్టాలి

కాజీపేట : సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పడిన ప్రభుత్వం తక్షణమే విద్యాశాఖపై ప్రత్యేక దృష్టిని సారించి సంస్కరణలకు శ్రీకారం చుట్టాలని బీసీటీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పెరుమాండ్ల సాంబమూర్తి కోరారు. 62వ డివిజన్ విష్ణుపురిలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడానికి అవసరమైన నిధులను మంజూరు చేయాలన్నారు.

ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంచుకోవాలి

విద్యారణ్యపురి: విద్యార్థులు ఆంగ్లభాషా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని హనుమకొండ ఎంఈఓ రాంకిషన్‌రాజు కోరారు. మంగళవారం ఇంగ్లీష్ టీచర్స్ అసోసియేషన్ ఎల్టా హనుమకొండ జిల్లాశాఖ, విద్యాశాఖ ఆధ్వర్యంలో హసన్‌పర్తిలోని మాంటిస్సోరి ప్రైమ్‌పాఠశాలలో జిల్లాస్థాయిలో విద్యార్థులకు స్పెల్ విజార్డ్, డ్రామా పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష కోఆర్డినేటర్లు సునీత, బి.రాధ ఎల్టా బాధ్యులు పాల్గొన్నారు.

అవయవదానానికి అంగీకారం



కేయూ క్యాంపస్: తెలుగు అధ్యాపకురాలు, విద్యా ఫౌండేషన్ సభ్యురాలు రాజారపు స్వర్ణలత మంగళవారం తన అవయవదానానికి అంగీకార పత్రాన్ని కాకతీయ యూనివర్సిటీ పబ్లికేషన్ సెల్ డైరెక్టర్, భీమారం లయన్స్‌క్లబ్ మాజీ జోనల్ చైర్మన్ నర్సింహారావుకు అందజేశారు. ఈ సందర్భంగా సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ స్వర్ణలతకు అభినందన పత్రాన్ని, ఐడీ కార్డును జారీ చేశారు. అవయవదానానికి ముందుకురావడం అభినందనీయమన్నారు.కార్యక్రమంలో విద్యా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిల్ల మహేందర్, చిర్రరాజు తదితరులు పాల్గొన్నారు.

విచారణ జరిపించాలి

కాజీపేట: గత ప్రభుత్వ హయాంలో నగరంతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకుల చేతిలో బందీగా మారిన చెరువులు, కుంటలపై కలెక్టర్ సమగ్రమైన విచారణకు ఆదేశించాలని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి ఎండీ అంకూస్ డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శిఖం భూములే కాకుండా ప్రభుత్వ అసైన్డ్ భూములను వదలకుండా ఆక్రమించుకుని అనధికారికంగా ప్లాట్లు చేసి విక్రయించిన విషయాన్ని గుర్తు చేశారు. కలెక్టర్, పశ్చిమ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

విద్యార్థినులు రాణించాలి

హన్మకొండ: విద్యార్థినులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని కాకతీయ మహిళా జూనియర్ కళాశాల అధ్యక్షుడు గుండా హరి నారాయణ, ప్రిన్సిపాల్ టి.శేషుకుమార్ అన్నారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో నక్కలగుట్టలోని కళాశాలలో కల్చరల్ ఫెస్ట్ జరిగింది. హరినారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని సరస్వతీ మాతా చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి ఫెస్ట్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమించాలని సూచించారు. విద్యార్థులకు ప్రశంసపత్రాలు, జ్ఞాపికలు అందించి. అభినందించారు.

15న సంత్‌సేవాలాల్ జయంతి వేడుకలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో సంత్‌సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు, మహాబోగ్ బండారో కార్యక్రమాన్ని ఈనెల 15న ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ కర్రెసదాశివ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా కేయూ వీసీ రమేష్, రిజిస్ట్రార్ మల్లారెడ్డి, యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌లాల్, ఆర్ట్స్‌కళాశాల వైస్ ప్రిన్సిపాల్ హనుమంతు, కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ నారాయణ, ఇంగ్లీష్ విభాగం అధిపతి డాక్టర్ దీ పాజ్యోతి, నిర్మల, రమేష్ పాల్గొంటారని తెలిపారు.

నయీంనగర్ : హనమకొండ పబ్లిక్ గార్డెన్‌లో గురువారం నిర్వహించనున్న 285వ సేవాలాల్ జయంతి ఉత్సవాలకు గోర్ బంజారాలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని గోర్ బంజారా సేవాలాల్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బాదావత్ బాలాజీ నాయక్ పిలుపునిచ్చారు.

సంక్షిప్త సమాచారం

నగర అభివృద్ధికి నిధులు కేటాయించండి

హన్మకొండ చౌరస్తా: గ్రేటర్ వరంగల్ మహానగర అభివృద్ధికి నిధులు కేటాయించాలని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు కోరారు. మంగళవారం జిల్లాకు విచ్చేసిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని వేయిస్తంభాల గుడి ఆవరణలో కలిసి వినతిపత్రం అందజేశారు. 408 చదరపు కిలోమీటర్ల సువిశాలమైన ఓరుగల్లులో పర్యాటకాభివృద్ధి, నీటిసరఫరా, వరద సంబంధిత పనులకు సుమారు వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ డిపార్టుమెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ ఎంపీ ఆనంద్‌మోసెస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కిక్‌బాక్సింగ్ పోటీల్లో పతకాల పంట

వరంగల్ స్పోర్ట్స్: ఈ నెల 7 నుంచి 11 వరకు న్యూఢిల్లీలో జరిగిన 3వ ఓపెన్ ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో హనుమకొండకు చెందిన క్రీడాకారులు పతకాలను సాధించారు. హనుమకొండ జిల్లా కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 13 మంది క్రీడాకారులు పాల్గొనగా అందులో ఒక్కొక్కరు మూడు ఈవెంట్లలో తలపడి పతకాలను సాధించారని అసోసియేషన్ జిల్లా సెక్రటరీ సిరిగిరి తిరుపతి తెలిపారు. పతకాలు సాధించిన వారిలో ఎం.సంతోషీ, జీ.శ్రీకర్, పి.పాంచజన్య, సాయిరామన్, జీ.పునర్వి, డి వాగ్దేవిరెడ్డి, డి.విభవాస్‌రెడ్డి, కే.సాత్విక్, ఎస్. వినీషా శ్యామల, ఏ సిరిచందన ఉన్నారు. అంతర్జాతీయ పోటీలకు తిరుపతి రెఫరీగా వ్యవహరించడం విశేషం. కోచ్‌గా సాంబశివ వ్యవహరించారు.

కరాటేలో హరిణ్యా ప్రతిభ

హన్మకొండ: అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో హనుమకొండ వికాస్‌నగర్‌లోని కౌటిల్య స్కూల్ విద్యార్థిని ట్రోఫీ గెలుచుకుంది. ఈ నెల 11న హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలు జరిగాయి. ఇందులో కౌటిల్య స్కూల్‌లో నాల్గో తరగతి చదువుతున్న హరిణ్యా పాల్గొని అత్యద్భుత ప్రదర్శన కనబరిచి అంతర్జాతీయ స్థాయి ట్రోఫీ గెలుచుకుంది. అంతకు ముందు జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొని ఎన్నో పతకాలు సాధించిందని స్కూల్ చైర్మన్ అశోక్‌రెడ్డి, డైరెక్టర తేజిక్ వర్మ, ప్రిన్సిపాల్ శాలిని తెలిపారు. మంగళవారం స్కూల్‌లో హరిణ్యాను యాజమాన్యం అభినందించింది.

క్రీడాకారులకు టీషర్టుల పంపిణీ

వరంగల్ స్పోర్ట్స్: ఈ నెల 16 నుంచి 19 వరకు సూర్యాపేటలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా బాలబాలికల జట్లకు మంగళవారం టీ షర్టులను పంపిణీ చేశారు. హనుమకొండలోని జేఎన్ఎస్‌లోని కబడ్డీ మైదానంలో మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలింపిక్స్ సంఘం ఉపాధ్యక్షుడు నలుబోలు సతీష్ క్రీడాకారులకు టీషర్టులను అందజేశారు.

ఎన్‌సీసీ కేడెట్లకు సన్మానం

విద్యారణ్యపురి: ఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న హనుమకొండలోని వాగ్దేవి కళాశాల ఎన్‌సీసీ కేడెట్లను మంగళవారం కళాశాలలో ఘనంగా సన్మానించారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ చందుపట్ల దేవేందర్ రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ చందుపట్ల వాహినదేవి ఎన్‌సీసీ కేడెట్లను సన్మానించారు.

అన్ని రంగాల్లో మహిళలు ముందడుగు

హన్మకొండ అర్బన్ : నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందడుగులో ఉన్నారని భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ (రిటైర్డ్) డాక్టర్ ఎ.విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పురుషాధిక్య ప్రపంచం అనేది గత కాలమని, నేటి కాలం అంతా మహిళలదేనని అన్నారు.

మహిళలకు రక్షణ కవచం 'సఖి'

కాజీపేట రూరల్ : సమాజంలో వేధింపులకు గురవుతున్న మహిళలకు రక్షణ కవచంగా సఖి వన్‌స్టాప్ సెంటర్ అండగా ఉంటుందని డీహెచ్‌డబ్ల్యూ స్వర్ణలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వనజాదేవి అన్నారు. కాజీపేట దర్గా గాంధీనగర్‌లో గల అంగన్‌వాడీ సెంటర్‌లో మంగళవారం చట్టాలపై మహిళలకు అవగాహన సదస్సులో వారు మాట్లాడారు.

నేటి నుంచి వడ్డేపల్లి రైల్వేగేట్ మూసివేత

కాజీపేట రూరల్ : కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్ సమీపంలోని వడ్డేపల్లి రైల్వేగేట్‌ను పర్మనెంట్‌గా మూసివేస్తున్నట్లు కాజీపేట రైల్వే ఇంజనీరింగ్ అధికారులు మంగళవారం తెలిపారు. వడ్డెపల్లి మీదుగా ఉనికిచర్లకు వెళ్లే మార్గంలోని రైల్వేగేట్ నంబర్–1 ఇ ని 14వ తేదీ నుంచి శాశ్వతంగా మూసివేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల దక్షిణ మధ్య రైల్వే అధికారులు రైల్వేగేట్ స్థలంలో నూతనం ఆర్వోబీని నిర్మించినట్లు తెలిపారు.

ఆర్ట్స్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్‌గా భాస్కర్

కేయూ క్యాంపస్ : హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్‌గా డాక్టర్ భాస్కర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బన్న అయిలయ్య భాస్కర్‌ను సన్మానించారు.

మహిళ ఆచూకీ లభ్యం

రామన్నపేట : ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చిన 66 ఏళ్ల వృద్ధురాలు తప్పిపోగా బాధితుల ఫిర్యాదు మేరకు ఆమె ఆచూకీ కనుక్కొని మంగళవారం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపారు. ఈనెల 8న నెక్కొండ మండలం ముదిగొండ హరిశ్చంద్ర నాయక్ తండాకు చెందిన జాటోతు సాజ్జి తన చెల్లి గుగులోతు హచ్చితో వచ్చి పక్షవాత చికిత్స నిమిత్తం ఎంజీఎంలో అడ్మిట్ అయ్యారు. 9న మధ్యాహ్నం బాధితురాలి చెల్లి హచ్చి మందుల కోసం బయటికి వెళ్లి వచ్చేసరికి కనబడలేదు. సునితకు మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో అదృశ్యం కేసు నమోదు చేశారు. కేసు నమోదు చేసిన అనంతరం ఇతర పోలీస్‌స్టేషన్లకు సమాచారం అందించారు.

టీఎస్ఎంసీ బిల్డింగ్ కమిటీ సభ్యుడిగా అజిత్ మహమ్మద్

కాశిబుగ్గ : వరంగల్ సంరక్ష సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డైరెక్టర్‌గా డాక్టర్ అజిత్ మహమ్మద్ తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ (టీఎస్ఎంసీ) బిల్డింగ్ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యాడు. మంగళవారం సంరక్ష ఆస్పత్రిలో ఆయనను హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ దొడ్డ రమేష్‌బాబు ఆధ్వర్యంలో సన్మానించి అభినందనలు తెలిపారు.

తహసీల్దార్‌కు భారీ లేఖ

వరంగల్: వరంగల్ తహసీల్దార్‌కు ఒక అజ్ఞాత వ్యక్తి ఆరు పేజీల లేఖ రాసినట్లు తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్ తెలిపారు. లేఖలో 11, 12వ శతాబ్దంలో ఓరుగల్లును పాలించిన పాలకుల గురించి ఉటంకించినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలోని ప్రజలు నోరుగల్లుగా మాట్లాడుతున్నందున ఓరుగల్లు పేరు వచ్చిందన్నారు. ప్రస్తుతం మండలంలో రేషన్‌షాపులను చదువుకున్న నిరుద్యోగులకు కేటాయించాలని కోరినట్లు తహసీల్దార్ తెలిపారు.

18న ఉద్యమకారుల సదస్సు

నయీంనగర్: అన్ని వర్గాల తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల అమలుకోసం ఈ నెల 18న హనుమకొండ ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో ఉద్యమకారుల ఐక్యత సదస్సు నిర్వహిస్తున్నామని పార్టీలకతీతంగా ఉద్యమకారులందరూ పాల్గొనాలని వరంగల్ ఉమ్మడి జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక చైర్మన్ జి.కుమారస్వామి, కన్వీనర్ ఆర్.నరోత్తమ సూరి కోరారు. మంగళవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న తెలంగాణ అనుకున్న లక్ష్యాలను చేరుకోలేదని, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో బీఆర్ఎస్ పార్టీ విఫలమైందన్నారు.

న్యాయవాదులకు అవకాశం ఇవ్వాలి

నయీంనగర్: రానున్న ఎంపీ, ఎమ్మెల్సీ, రాజ్యసభ ఎన్నికల్లో న్యాయవాదులకు బీఆర్ఎస్ పార్టీ అవకాశం ఇవ్వాలని ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ లీగల్ సెల్ ప్రెసిడెంట్ నీలా శ్రీధర్‌రావు కోరారు. మంగళవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో న్యాయవాదుల పాత్ర ఎనలేనిదన్నారు. న్యాయవాదుల్లో ఎవరికి టికెట్ ఇచ్చినా అభ్యంతరం లేదన్నారు. సమావేశంలో ఎం.జైపాల్, శ్రీనివాస్‌రావు, డేవిడ్‌రాజు, సతీష్, రమేష్, సమ్మిరెడ్డి, వసంత్‌కుమార్ పాల్గొన్నారు.

యాజమాన్యంపై చర్య తీసుకోవాలి

కాశోజి సెంటర్ : నగరంలో ఎంపీసీ, ఐఐటీ, జేఈఈ, బైపీసీ, నీట్ పేర్లతో జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా విద్యాసంవత్సరం ముగియకుండానే అక్రమ అడ్మిషన్లు చేపడుతున్న విద్యామందిర్ క్లాసెస్ యాజమాన్యాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యాసంవత్సరం ముగిసిన తర్వాత అడ్మిషన్ ప్రక్రియ చేపట్టాలి కానీ ఇందుకు భిన్నంగా నగరంలో ఎక్కడపడితే అక్కడ భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేసి కనీసం సౌకర్యాలు లేకుండా కళాశాలలు ఏర్పాటు చేసుకొని విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక డబ్బులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై విద్యాశాఖ అధికారులు స్పందించకపోవడం సిగ్గుచేటని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న యాజమాన్యాలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించాలని కోరారు.

ట్రేడ్ లైసెన్స్ లేకుంటే సీజ్

గ్రేటర్ ఇన్‌చార్జ్ కమిషనర్ రాధిక గుప్తా

వరంగల్ అర్బన్: ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని బల్దియా ఇన్‌చార్జ్ కమిషనర్ రాధిక గుప్తా మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. నగర పరిధిలోని వ్యాపార యజమాన్యాలు, దుకాణాదారులు తెలంగాణ రాష్ట్ర పురపాలికల చట్టం–2019 సెక్షన్ 158 ప్రకారం వ్యాపారాలు కొనసాగించుచేందుకు మహానగర పాలక సంస్థ వరంగల్ నుంచి విధిగా అనుమతి పత్రం/అనుమతి రెన్యువల్ (ట్రేడ్ లైసెన్స్) తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎవరైనా అనుమతి లేకుండా వ్యాపారం కొనసాగిస్తే వారిపై జూన్‌లోపు లైసెన్స్ ఫీజు మొత్తంలో 25% శాతం, జూలై నుంచి 50శాతం పెనాల్టీతో వసూలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ట్రేడ్ లైసెన్స్ ఉన్న వారు ప్రతీ సంవత్సరం ఫిబ్రవరి మొదటి వారంలో డిమాండ్ రెన్యువల్ చేసుకోవాలన్నారు. మార్చి నెలాఖరు వరకు అపరాధ రుసుము లేకుండా ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాలని సూచించారు. ఏప్రిల్ 1 నుంచి 25 శాతం అపరాధ రుసుము విధించబడుతుందని పేర్కొన్నారు. మే1 నుంచి 50శాతం అపరాధ రు సుము విధించనున్నట్లు తెలిపారు. 15 లోగా.. ఫీ చెల్లించాలని లేకపోతే.. తెలంగాణ పురపాలికల చట్టం –2019లోని సెక్షన్ 264 ప్రకారం ఎవరైతే అనుమతి/రెన్యువల్ లేకుండా వ్యాపారం చేస్తారో వారి దుకాణాన్ని మూసివేసే అధికారం ఉందన్నారు. లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని చెప్పారు.

సీఎంను కలిసిన సీపీ



వరంగల్ క్రైం: మేడిగడ్డ ప్రాజెక్ట్ పరిశీలనకు కాళేశ్వరానికి బయల్దేరిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సీపీ అంబర్ కిషోర్ ఝా మర్యాదపూర్వకంగా కలిశారు. మార్గమధ్యలో ఎస్ఎస్ఆర్ హోటల్ చేరుకున్న సీఎంను ఆయన కలిసి పూలమొక్క అందజేశారు.

16న దేశ వ్యాప్త సమ్మె



వరంగల్ : మోదీ కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలపై ఫిబ్రవరి 16న దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్మిక సమ్మె, గ్రామీణ బంద్‌ను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ కార్మికులకు పిలుపునిచ్చారు. మంగళవారం అగ్రికల్చర్ యూనివర్సిటీ ప్రాంతీయ పరిశోధన కేంద్రంలోని ఏడీఆర్‌కు సమ్మె నోటీసు ఇచ్చిన అనంతరం ఉద్యోగులు, కార్మికులకు సమ్మె కరపత్రాలు పంపిణీ చేసి సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవి, ఎస్.సురేష్, రఘు లు పాల్గొన్నారు.